

# జాతీయ సమ్మేళనానికి మాలీ మహా సంఘ నేతలు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** అఖిల భారతీయ మాలీ మహా సంఘం 24వ స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్‌కు చెందిన అఖిల భారతీయ మాలి మహా సంఘం మహా రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జైన్‌కు బయలుదేరి వెళ్లారు. వారితో పాటు సావిత్రీ బాయిపూలే మహిళా మండలి సభ్యురాలు కల్పన పెట్కులే, లత గుర్నూలే, మమత మహాడోలే, శ్రీను ఆచారి, నందిని గురునులే తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ ఈ సదస్సులో జాతీయ స్థాయిలో మాలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే తెలంగాణ మాలిలకు ఎస్టీ హోదా విషయంలో కేంద్రంపై ఒత్తిడి పెంచే విధంగా జాతీయ కార్యవర్గాన్ని ఒప్పించి కార్యాచరణ రూపొందించనున్నట్లు వివరించారు.

# ఐటీడీఏ పీఓను బదిలీ చేయాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సీఆర్టీల నియామకాల్లో ఇష్టానుసారంగా వ్యవహరించిన ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిని ప్రభుత్వం వెంటనే బదిలీ చేయాలని ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్‌రావు మొకాశి డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సీఆర్టీల నియామకాల విషయంలో జరుగుతున్న అవకతవకలపై ప్రశ్నించిన ఆదివాసీ సంఘాల నాయకులతో నిర్లక్ష్యంగా, బెదిరింపు ధోరణిలో మాట్లాడారని తెలిపారు. సీఆర్టీల నియామకాల విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరించటం తగదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇప్పటికే ఎవరికైనా నియామక ఆదేశాలు జారీ చేసి ఉంటే వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని అర్హతలు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులను మాత్రమే సీఆర్టీలుగా నియమించాలని కోరారు. ఐటీడీఏ కార్యాలయంలో దీర్ఘకాలంగా విధులు నిర్వర్తిస్తూ అవకతవకలకు పాల్పడుతున్న ఉద్యోగులను వెంటనే వేరే ప్రాంతాలకు బదిలీ చేయాలన్నారు. లేనియెడల ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని బెల్లంపల్లి డీఎల్‌పీఓ సఫ్దర్ అలీ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం తాండూర్ మండలం నర్సాపూర్ గ్రామపంచాయతీని ఎంపీడీఓ పి శ్రీనివాస్, ఎంపీఓ జి అనిల్ కుమార్‌లతో కలిసి తనిఖీ చేశారు. ముందుగా జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విష జ్వరాలు సోకే అవకాశం ఉంటుందని, ప్రతిఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జగదీష్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** అంగన్వాడి కేంద్రాల్లో నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని వీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారికు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీకనంద్, గొడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్‌లు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడి కేంద్రాల్లో చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కానీ జిల్లాలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకమైన కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. రెండు రోజుల క్రితం వాంకిడి మండలంలోని జైత్పూర్ అంగన్వాడి కేంద్రంలో పాడైపోయిన కోడిగుడ్లను పంపిణీ చేశారని తెలిపారు. నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# జ్వాలతో విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం

- విద్యార్థినుల స్వీయ రక్షణ కోసం నూతన కార్యక్రమానికి శ్రీకారం
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** విద్యార్థినులకు స్వీయ రక్షణ కోసం ఆపరేషన్ జ్వాల పేరుతో కరాటే శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ బాలికల కళాశాల, పాఠశాలలో విద్యార్థులకు ఆపరేషన్ జ్వాల పేరుతో శిక్షణ తరగతులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జ్వాలతో విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. ఆపద సమయంలో ఆదుకునేలా జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, విద్యార్థినులు స్వీయ రక్షణగా ఉండాలనే ఉద్దేశంతో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మహిళలు, విద్యార్థినులకు కరాటే శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు పలు ప్రభుత్వ, ప్రైవేట్ కరాటే కోచ్‌ల సహకారంతో శిక్షణను అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు సాయంత్రం సమయంలో గంట సమయం విద్యార్థులకు శిక్షణ ఉంటుందని, దీనికి సహకరించిన జిల్లా విద్యా శాఖ బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. చిన్ననాటి నుంచి విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే జ్వాల ఉద్దేశమని, విద్యార్థులు, చిన్నారులు ఆపద సమయంలో స్వీయ రక్షణతో తమనుతాము కాపాడుకునే ధైర్యాన్ని కలిగి ఉంటారని తెలిపారు. దీంతో పాటు ఆపద సమయంలో పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని, మహిళలకు ఎల్లవేళలా షీటీం బృందాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎలాంటి ఆపదలోనైనా డయల్ 100, ఆదిలాబాద్ షీటీం బృందాన్ని సంప్రదించాలని సూచించారు. మహిళల పట్ల జరిగే నేరాలను తగ్గించడానికి జిల్లాలో వినూత్నంగా ఇలాంటి కార్యక్రమాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, కళాశాల ప్రధానోపాధ్యాయులు, పట్టణ సీఐలు, ప్రైవేట్, ప్రభుత్వ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ఏకతాటిపైకి రావాలి

**టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్యశాంతి కుమారి**





**ఉద్యమకెరటం, దహెగాం:** సమస్యల సాధన కోసం ఉపాధ్యాయులందరు ఏకతాటిపైకి రావాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో దహెగాం మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ హైస్కూలు, ప్రాథమిక పాఠశాలలు, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు కల్పించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక వార్డెన్ నియమించాలన్నారు. పనిచేసే గెస్ట్, పార్ట్‌టైం, ఔట్‌సోర్సింగ్, కేజీబీవీ సిబ్బంది, ఆశ్రమ పాఠశాలల సీఆర్టీలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. దీంతో పాటు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రత్యేక వార్డెన్లను, కేర్ టేకర్లను నియమించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలన్నారు. అలాగే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, పెండింగ్ బిల్లులను వెంటనే రిలీజ్ చేయాలని, 317 జీవధార స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు పంపించాలని పేర్కొన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయులకు మెరుగైన హెల్త్ స్కీమ్ తీసుకురావాలని, పూర్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన నిధులు మంజూరు చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, ఉపాధ్యాయుల సర్దుబాటును నిబంధనల ప్రకారం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తులసిరామ్, మండల అధ్యక్షులు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రోహిత్, జిల్లా కమిటీ సభ్యులు వినేష్ తదితరులు పాల్గొన్నారు.



# వ్యసనాలకు దూరంగా ఉండాలి

**ఉద్యమ కెరటం, వాంకిడి:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ సత్యనారాయణ అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడా ప్రతిభను గుర్తించాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందడంతో పాటు శారీరకంగా దారుఢ్యంగా ఉంటారని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొనగా, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు ఎస్సై ప్రశాంత్ బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ చంద్రయ్య, పీటీలు ఎర్మీ రాజేశ్వర్, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు చరణ్, తిరుపతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రహదారి మరమ్మత్తులు చేపట్టాలి



**ఉద్యమ కెరటం, జైనూర్ (నార్నూర్):** మండలంలోని మాదాపూర్ గ్రామం నుంచి ఇంద్రవెల్లి వెళ్లే ప్రాంతంలో గొట్టి మార్గం బీటి రోడు మంజూరు చేయాలని దళిత హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు జాదవ్ శేఖర్ డిమాండ్ చేశారు. అత్యవసర సమయంలో ఆదిలాబాద్ వెళ్లే మార్గం చాలా దగ్గర ఉందని తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఖానాపూర్ ఎమ్మెల్యేలు ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని కోరారు. దాదాపు నాలుగున్నర కిలో మీటర్ల రోడ్డును ఎమ్మెల్యే గొట్టిపటారు నుంచి మాదాపూర్ వచ్చే రోడ్డు మూడు కిలో మీటర్లు ఖానాపూర్ పరిధిలో వస్తుందని, మాదాపూర్ నుంచి గొట్టిపటార్ వరకు రెండున్నర కిలో మీటర్లు ఉంటుందన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు కలిసి రోడ్డును కనెక్టివిటీ చేసి బీటి రోడ్డు మంజూరు చేయాలని పేర్కొన్నారు. నార్నూర్, భీంపూర్, మహాగాం, కొత్తపల్లి, కాచిగూడ, శేకుగూడ, కంపూర్ తాడేహత్నూర్ దాదాపు 36 గ్రామాలకు పరిష్కారమయ్యే మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాబు హరిచంద్ పండరి కైలాస్, బాలాజీ, ప్రేమ్, దౌలత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన



**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, తాగునీరు, వంటశాల, భోజనశాల వసతిగృహంలోని వసతులు, పడకలు, మూత్రశాల గదులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహారిగోడ, వంటశాల ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. భోజనం తయారీ సమయంలో నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరకులు వినియోగించాలని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వర్షాకాలంలో పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ పగడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని తెలిపారు. బడిబయట పిల్లలు, మధ్యలో బడి మానేసిన పిల్లలను గుర్తించాలని, వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి పాఠశాలకు వచ్చేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాల భవనంపై నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తాండూర్ మండల విద్యాధికారి ఎస్ మల్లేశం, ఎంపీఓ అనిల్ కుమార్, కేజీబీవీ ఎస్ఓ జె కవిత, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

